# ఓటరుగా నమోదు చేసుకోవాలి

- ఓటరు నమోదు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి
- అధికారులు ప్రచారం చేయాలి
- రెండుచోట్ల ఓట్లు ఉన్నవారిని జాబితాలోంచి తొలిగించాలి
- 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా చేరాలి
- కలెక్టర్ రాజర్షి షా
- ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాల పరిశీలన, తనిఖీ



మెదక్ పట్టణంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, (నమస్తే తెలంగాణ)/ కొల్చారం/ రామాయంపేట రూరల్/ చిలిపిచెడ్/ నిజాంపేట, జనవరి 20 : ఓటరు జాబితాల్లోని డబుల్ ఎంట్రీలను గుర్తించి రిమార్క్‌లతో కూడిన చెక్ లిస్ట్‌ను బీఎల్‌వోలకు ఇచ్చి, ఇంటింటి సర్వే ద్వారా పరిశీలించి, నివేదికను రూపొందించి అందజేయాల్సిందిగా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మెదక్‌లోని జిల్లా అటవీశాఖ కార్యాలయం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం 136, 138, కొల్చారం మండలం అప్పాజిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రం 55లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని కలెక్టర్ శనివారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో బీఎల్‌వోల వద్ద ఓటరు జాబితా, అవసరం మేర ఫారం-6, 7, 8 అందుబాటులో ఉన్నాయా? అని పరిశీలించారు. పోలింగ్ కేంద్రం పరిధిలో మొత్తం ఓటర్ల సంఖ్య ఎంత, కొత్తగా నమోదుకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయి? పేరు మార్పు చేర్పులపై ఎంతమంది దరఖాస్తు చేసుకున్నారు, వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారా? అనే వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక ఓటరు నమోదు శిబిరంపై గ్రామాల్లో చాటింపు వేయాలన్నారు. శిబిరం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉంటుందన్నారు. ఫారం 7 జనరేషన్ ఎలా చేస్తున్నారని బీ ఎల్వో యాప్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఫొటో, డబుల్ ఎంట్రి, ఇతర పొరపాట్లు లేకుండా సరి చేయాలన్నారు. 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంలో అవగాహన కలిగించాలన్నారు. ఒకే కుటుంబంలోని ఓటర్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కు కలిగివుండేలా నమోదు చేయాలన్నారు. ఓటరుగా నమోదు కావడానికి ఇదే చివరి అవకాశమని, ఈ శిబిరాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ తెలిపారు. ఆయనతో మెదక్ ఆర్డీవో అంబాదాస్ రాజేశ్వర్, నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్లు శ్రీనివాస్, చంద్రశేఖర్, ఎంపీడీవో గణేశ్‌రెడ్డి, బీఎల్వో సూపర్ వైజర్లు, బీఎల్వోలు పాల్గొన్నారు.

**నేడు ఓటరు నమోదుకు అవకాశం**

మెదక్, నర్సాపూర్ నియోజకవర్గాల్లోని 579 పోలింగ్ స్టేషన్లలో శని, ఆదివారాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. కొల్చారం మండలం అప్పాజిపల్లిలో పోలింగ్ స్టేషన్‌ను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ స్టేషన్‌లో ఓటరు నమోదుకు ఫారం-6, 7, 8 అందుబాటులో ఉన్నా యా? అని అడిగి తెలుసుకున్నారు. 2024 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన యువతకు సమాచారం ఇచ్చివారు పేర్లు నమోదు చేసుకునేలా చూడాలని బీఎల్వోకు సూచించారు. గ్రామాల్లో టాంటాం, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా ద్వారా సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. కలెక్టర్‌తోపాటు నర్సాపూర్ ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ మహ్మద్‌గఫార్‌మియా, డిప్యూటీ తహసీల్దార్ నాగవర్ధన్, ఆర్ఐ ప్రభాకర్, బీఎల్వో భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

**పోలింగ్ కేంద్రాల పరిశీలన**

రామాయంపేట మండలం లక్ష్మాపూర్ గ్రామంలో 65, 66 పోలింగ్ కేంద్రాల్లో నిర్వహిస్తున్న స్పెషల్ క్యాంపెయిన్ డే ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమాన్ని ఆర్డీవో అంబుదాస్ రాజేశ్వర్ శనివారం పరిశీలించారు. ఆయన వెంట రామాయంపేట తహసీల్దార్ రజనీకుమారి, ఆర్ఐ రాజు తదితరులు ఉన్నారు.

**గ్రామాల్లో ఓటరు నమోదు శిబిరాలు**

చిలిపిచెడ్ మండలంలోని 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సింధూజ తెలిపారు. శనివారం మండలంలోని బండపోతుగల్, చండూర్, చిట్కుల్, గౌతాపూర్, ఫైజాబాద్ ఆయా గ్రామాల్లో పోలింగ్ బూతుల వద్ద ఓటు హక్కు నమోదు కార్యక్రమం నిర్వహించారు. శని, ఆదివారాల్లో ఓటరు నమోదు ప్రత్యేకగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్‌వో వెంకటేశం, సతీశ్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

**ఓటు హక్కు నమోదు చేసుకోవాలి**

నిజాంపేట మండలం చల్మెడ గ్రామంలో ఓటరు నమోదు ప్రక్రియతోపాటు ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని సర్పంచ్ నర్సింహారెడ్డి పరిశీలించారు. 18 ఏండ్లు నిండిన యువత ఓటుహక్కు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ గంగాధర్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి నర్సింహారెడ్డి, బీఎల్వోలు, ఉపాధ్యాయులు ఉన్నారు.



జిల్లాస్థాయి వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శనల ఫలితాలను విడుదల చేస్తున్న కలెక్టర్

## రాష్ట్రస్థాయి ప్రదర్శనలో సత్తా చాటాలి

■ కలెక్టర్ రాజర్షిషా

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 20: రాష్ట్రస్థాయి ప్రదర్శనలో సత్తా చాటి, జిల్లాకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ ఆదేశాల మేరకు ఈనెల 18, 19వ తేదీల్లో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక, గణిత, పర్యావరణ ప్రదర్శనను సీనియర్, జూనియర్ విభాగాల్లో వర్చువల్ పద్ధతిలో నిర్వహించారు. శనివారం కలెక్టరేట్‌లో ఫలితాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి అంశంలో ముగ్గురిని ఎంపిక చేశామని, ఇందులో ప్రథమ స్థానంలో ఎంపికైన విద్యార్థులు రాష్ట్రస్థాయిలో వర్చువల్ పద్ధతిలో జరిగే రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో పాల్గొంటారన్నారు. రాష్ట్రస్థాయిలోనూ ప్రతిభ చూపాలన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను కలెక్టర్ అభినందించారు. కార్యక్రమంలో డీఈవో రాధాకిషన్, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, ఎంఈవో నీలకంఠం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ పాల్గొన్నారు.

## మిల్లర్ల అలసత్వాన్ని ఉపేక్షించం

- సీఎంఆర్ పూర్తి చేయాలి
- ఆర్ఆర్ యాక్ట్ కింద 125 శాతం రికవరీ చేస్తాం
- కలెక్టర్ రాజర్షి షా



రైస్‌మిల్లర్ల యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

మెదక్, జనవరి 20 (నమస్తే తెలంగాణ): సీఎంఆర్ కేటాయింపుల్లో జాప్యాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, మిల్లర్ల అలసత్వాన్ని ఏ మాత్రం ఉపేక్షించబోమని కలెక్టర్ రాజర్షి షా స్పష్టంచేశారు. జిల్లాలోని రైస్‌మిల్లుల్లో సీఎంఆర్ కేటాయింపులపై నిర్లక్ష్యానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అధిక శాతం సీఎంఆర్ పెండింగ్ ఉన్న మిల్లుల యాజమాన్యాలతో శనివారం కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో అత్యవసర సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఈ నెల 31 వరకు అవకాశం ఇచ్చిందని, అప్పటిలోగా బియ్యం సరఫరా చేయని మిల్లుల యజమానులపై ఆర్ఆర్‌యాక్ట్ కింద స్థిర, చర ఆస్తులను జప్తు చేయడమే కాకుండా క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. సీఎంఆర్ కేటాయింపులపై కూలంకషంగా చర్చించారు. రైతుల నుంచి ప్రభుత్వపరంగా కొనుగోలు చేసి సమకూర్చిన ధాన్యాన్ని వేగంగా మిల్లింగ్ చేసి ఈ నెలాఖరులోగా కస్టమ్ మిల్లింగ్ రైస్ నిల్వలను భారత ఆహార సంస్థకు చేరవేయాలని సూచించారు. రికవరీ చేసేటప్పుడు 125 శాతం ఆర్ఆర్ యాక్ట్ కింద రికవరీ చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరికృష్ణ, డీసీఎస్ఓ బ్రహ్మారావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, రైస్ మిల్లర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

### ఎమ్మార్పీఎస్ మెదక్ మండలాధ్యక్షుడిగా శ్రీనివాస్

మెదక్ మున్సిపాలిటీ, జనవరి 20 : ఎమ్మార్పీఎస్ మెదక్ మండల కమిటీని శనివారం జిల్లా కేంద్రంలో రాష్ట్ర కార్యదర్శి ఎర్రలింగం ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డప్పు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా పోచయ్య, కోశాధికారిగా స్వామి, ఉపాధ్యక్షులుగా నారాయణ, సామేల్, ప్రభాకర్, నర్సింహులు, కార్యవర్గ సభ్యులుగా నర్సింహులు, శ్రీనివాస్, పోచయ్యను ఎన్నుకున్నారు.

### తండ్రికి తలకొరివి పెట్టిన కూతురు



తండ్రికి తలకొరివి పట్టిన కూతురు హారిక

రామాయంపేట రూరల్, జనవరి 20 : గుండెపోటుతో మృతి చెందిన తండ్రికి పెద్ద కూతురు తలకొరివి పెట్టిన ఘటన రామాయంపేట మండలం తొనిగండ్లలో జరిగింది. యాదగిరి మెదక్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. గుండెపోటుతో మృతి చెందాడు. తొనిగండ్లలో శనివారం అంత్యక్రియలు జరిగాయి. యాదగిరి పెద్దకూతురు హారిక అమెరికా నుంచి వచ్చి తండ్రికి తలకొరివి పెట్టింది. అంత్యక్రియల్లో మెదక్ డీఎస్పీ ఫణీంద్ర, టౌన్ సీఐ వెంకటేశ్, రామాయంపేట, మెదక్ టౌన్ ఎస్సైలు రంజిత్, పోచయ్య పాల్గొన్నారు.

### కోనాపూర్ చెరువులో మృతదేహం లభ్యం



మల్లేశం(ఫైల్)

రామాయంపేట, జనవరి 20 : ఓ వ్యక్తిని హత్య చేసి మృతదేహాన్ని కోనాపూర్ ఊర చెరువులో పడేసిన ఘటన రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సంగారెడ్డి జిల్లా ఆందోల్ జోగిపేట మండలానికి చెందిన ఆందోల్ జోగిపేటకు చెందిన చాకలి మల్లేశం (40)ని హత్య చేసి, మృతదేహాన్ని పెట్రోల్ పోసి నిప్పంటించారు. అనంతరం కాలిన మృతదేహన్ని మెదక్ జిల్లా రామాయంపేట మండలం కోనాపూర్‌లోని చెరువులో పడేశారు. ఆందోల్ జోగిపేట పోలీస్‌స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదవుతుందని రామాయంపేట సీఐ లక్ష్మీబాబు, ఎస్సై రంజిత్ తెలిపారు.



శివ్వంపేట : పిల్లుట్లలో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



వెల్దుర్తి : అచ్చంపేటకు చెందిన నవ్య కుటుంబీకులకు రూ. లక్ష సీఎం ఆర్‌ఎఫ్ ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

## బాధిత కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ

శివ్వంపేట/ నర్సాపూర్/ వెల్దుర్తి, జనవరి 20 : శివ్వంపేట మండలం పిల్లుట్ల గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన బుర్ర వెంకటనర్సాగౌడ్ కుటుంబాన్ని, రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంద్ర నాగరాజు, గుర్రాల ప్రశాంత్ కుటుంబాలను ఎమ్మెల్యే సునీతారెడ్డి శనివారం పరామర్శించారు. బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేసి, అండగా ఉంటానని, అధైర్యపడొద్దని ధీమా కల్పించారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నయీమొద్దీన్, కౌన్సిలర్ అశోక్‌గౌడ్, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సిలువేరి వీరేశం, బీఆర్ఎస్ నాయకులు యాదాగౌడ్, చింత స్వామి, సత్యంగౌడ్, సూరారం నర్సింహులు, బోగ చంద్రశేఖర్ తదితరులు ఉన్నారు.

**ఎల్వోసీ చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే**

నర్సాపూర్ పట్టణంలోని జగన్నాథరావు కాలనీకి చెందిన మహ్మద్ రఫీయొద్దీన్‌కు వైద్య చికిత్స నిమిత్తం రూ.లక్ష సీఎంఆర్‌ఎఫ్ ఎల్వోసీ చెక్కును శనివారం క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు.

మాసాయిపేట మండలం అచ్చంపేట గ్రామానికి చెందిన నవ్యకు వైద్యచికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులకు రూ.లక్ష సీఎంఆర్‌ఎఫ్ ఎల్వోసీని నర్సాపూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి అందజేశారు. ఆపదలో పేదలను ఆదుకుంటానన్నారు.

### బీడీ కార్మికులకు పింఛన్ పెంచాలి



మాట్లాడుతున్న శివంది సత్యం

రామాయంపేట, జనవరి 20: బీడీ కార్మికులకు పింఛన్‌ను రూ.1000 నుంచి రూ.8 వేలకు పెంచాలని నూతన బీడీ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివంది సత్యం డిమాండ్ చేశారు. శనివారం రామాయంపేటలో ఆయన మాట్లాడుతూ దశాబ్ద కాలంగా బీడీ కార్మికులంటే ప్రభుత్వాలు మరిచిపోయాయని, ఓట్లకోసం వచ్చే నాయకులు వారి సమస్యలు ఎందుకు పట్టించుకోరని మండిపడ్డారు. బీడీ కార్మికులకు పింఛన్ పెంచి కేంద్రం న్యాయం చేయాలన్నారు.

### కష్టపడి చదివితే ఫలితం

శివ్వంపేట, జనవరి 20: కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంతోష అన్నారు. శివ్వంపేటలోని జడ్పీహెచ్ఎస్‌లో శనివారం బాల్యవివాహాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలను వ్యతిరేకించాలని, చేసుకుంటే జరిగే నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసుమతి, హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

## గ్రామాల అభివృద్ధికి చర్యలు చేపట్టాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ హరికృష్ణ

శివ్వంపేట, జనవరి 20 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వస్తున్న నిధులతో పంచాయతీల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని ఎంపీపీ కల్లూరి హరికృష్ణ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో భారతి ఆధ్వర్యంలో అన్నిశాఖల అధికారులతో గ్రామ పంచాయతీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (జీపీడీపీ)పై అవగాహన సమావేశానికి ఎంపీపీ హాజరయ్యారు. గ్రామపంచాయతీల అభివృద్ధికి ఎంచుకున్న రెండు ఆప్షన్లలో వందశాతం ప్రభుత్వ భవనాల నిర్మాణానికి, పారిశుద్ధ్యం, సిబ్బంది వేతనాలు, హరితహారం కోసం అన్ని శాఖల సిబ్బందితో సమన్వయం చేసుకుని ప్రతిపాదనలు సిద్ధం చేసి, ఈపాస్ గ్రామ స్వరాజ్యం పోర్టల్‌లో నమోదు చేయాలని ఆయన సూచించారు. ఈనెల 25 నుంచి పంచాయతీల్లో గ్రామసభలు నిర్వహించి, ప్రణాళికకు ఆమోదం పొందాలన్నారు. సర్పంచుల పదవి కాలం ఈ నెలాఖరుతో ముగియనుండడంతో గ్రామంలో సర్పంచులు చేసిన పనులకు ఇంకా రావాల్సిన పెండింగ్ బిల్లులు చెల్లించుటకు అన్ని రకాలుగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. సమావేశంలో సర్పంచ్‌లు సుధాకర్‌రెడ్డి, ఆంజనేయులు, ఎంపీవో తిరుపతిరెడ్డి, డాక్టర్ సాయిసౌమ్య, ఐకేపీ ఏపీఎం వెంకటేశ్వర్లు, ఏఈలు భాస్కర్, దుర్గాప్రసాద్, సూపర్‌వైజర్లు వసుమతి, సంతోష, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

### వివాహితకు అస్వస్థత


రామాయంపేట, జనవరి 20 : రామాయంపేట బస్టాండులో ఓ మహిళ అపస్మారక స్థితిలో కనిపించింది. ఆమె మెదక్‌లో బస్సెక్కి సిద్దిపేటకు టికెట్ తీసుకుంది. మార్గమధ్యలో రామాయంపేటలో కళ్లు తిరుగుతున్నాయని, బస్సు దిగి బస్టాండ్‌లోని బెంచీలపై పడిపోయింది. గమనించిన స్థానికులు అంబులెన్స్‌లో ఆమెను ప్రభుత్వ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స చేయడంతో ఆమెకు మెళకువ రావడంతో వైద్యులు అడ్రస్ అడిగి తెలుసుకున్నారు. తాను హైదరాబాద్‌కు చెందిన కొలిపాక అర్చన అని, భర్తతో గొడవ పడి ఇంట్లోంచి వచ్చేసినట్లు తెలిపింది. శుక్రవారం అర్చన మిస్సింగ్ కేసు నమోదు చేయించినట్లు భర్త తెలిపాడు. సదరు మహిళను చికిత్స కోసం ఆమె భర్త నగరంలోని ఒక ప్రైవేటు దవాఖానలో చేర్పించినట్లు సమాచారం.

### ఎన్నికలకు సమయం కాదు

■ ఎస్‌జీటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశం

వెల్దుర్తి, జనవరి 20 : ఇప్పుడు పరీక్షల సమయమని, ఈ పరిస్థితుల్లో పాఠశాల యాజమాన్య కమిటీలకు ఎన్నికలు నిర్వహించాలన్న ప్రభుత్వం నిర్ణయం సరికాదని సెంకడరీ గ్రేడ్ టీచర్స్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరికెల వెంకటేశం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పరీక్షల సమయం దగ్గర పడిందని, ఇప్పటికే పాఠశాలల్లో విద్యార్థులను సిద్ధం చేస్తున్నారన్నారు. ఎస్ఎంసీ ఎన్నికల నిర్ణయాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

### తూప్రాన్‌లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్‌టీం

తూప్రాన్, జనవరి 20: సిమెంట్, స్టీల్, సెంట్రింగ్ సామగ్రి దుకాణంలో శుక్రవారం అర్ధరాత్రి దుండగులు చొరబడి రూ. 7.10 లక్షల పైచిలుకు నగదు దోచుకెళ్లిన ఘటన తూప్రాన్ పోలీస్‌స్టేషన్‌లో జరిగింది. సీఐ శ్రీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్‌లో మామిళ్ల శ్రీకాంత్‌కు నటరాజ్ ట్రేడర్స్ పేరుతో హోండా షోరూం ఎదురుగా స్టీల్, సిమెంట్, సెంట్రింగ్ షాపు ఉంది. రెండు రోజులుగా వచ్చిన డబ్బులు రూ.7.10 లక్షలను కౌంటర్‌లో దాచిపెట్టాడు. శుక్రవారం రాత్రి 8:30 గంటల ప్రాంతంలో యథావిధిగా దుకాణాన్ని మూసేసి ఇంటికి వెళ్లిపోయాడు. శనివారం ఉదయం 7:45 గంటలకు దుకాణాన్ని తెరిచి చూడగా రేకులు విప్పి, సీలింగ్ పగలగొట్టినట్లు శ్రీకాంత్ గుర్తించాడు. వెంటనే కౌంటర్ దగ్గరికి వెళ్లి చూడగా కౌంటర్‌లో దాచిన డబ్బులు కనిపించలేదు. శ్రీకాంత్ వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీధర్ తెలిపారు.

### ఆలయాలను అలంకరించుకోవాలి

పెద్దశంకరంపేట, జనవరి 20: సోమవారం అయోధ్యలో శ్రీరాముని పట్టాభిషేకం సందర్భంగా ప్రధాని పిలుపు మేరకు ఆలయాలను అలంకరించుకోవాలని రామజన్మభూమి తీర్థక్షేత్ర బాధ్యులు సీతారామరావు, జైహింద్‌రెడ్డి శనివారం తెలిపారు. పెద్దశంకరంపేటలో 22న రామాలయ కమిటీ అధ్యక్షుడు గుజ్జరి కనకరాజు ఆధ్వర్యంలో భారీ ఎల్ఈజీ స్క్రీన్లు ఏర్పాటు చేసి శోభాయాత్ర, అన్నదానం ఏర్పాటు చేస్తున్నారన్నారు.

### మైనంపల్లి పరామర్శ

రామాయపేటరూరల్, జనవరి 20 : మండలంలోని లక్ష్మాపూర్‌కు చెందిన మహేశ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మైనంపల్లి హన్మంతరావు శనివారం మృతుడి కుంటీకులను పరామర్శించి, తల్లి భూలక్ష్మికి ధైర్యం చెప్పారు. మైనంపల్లి వెంట కాంగ్రెస్ నాయకులు రమేశ్‌రెడ్డి, వెంకటి, హన్మంతరావు ఉన్నారు.

### విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి

పెద్దశంకరంపేట, జనవరి 20 : మండలంలోని రామోజిపల్లి గ్రామంలో విద్యుత్ షాక్‌తో మూడు గేదెలు మృతి చెందాయి. బాధితుల కథనం ప్రకారం.. రామోజిపల్లి గ్రామ శివారులోని ట్రాన్స్‌ఫార్మర్ పరిసర ప్రాంతాల్లో వైర్లు తెగిపోవడంతో ఇంటికొస్తున్న మూడు గేదెలు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే చనిపోయాయి. ఇందులో బాసాడ సురేశ్‌కు చెందిన గెదె, శ్రీశైలం గేదె, వెంకటేశం గేదె ఉన్నాయి. దాదాపు రూ. 1.30లక్షల విలువ చేస్తాయని రైతులు తెలిపారు. ఘటనా స్థలాన్ని ఎస్సై బాలరాజు పరిశీలించి ఇన్సూరెన్స్ ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు.

## 'ఈ-పాస్'లో ఎరువుల విక్రయాలు

■ డీఏవో గోవింద్ ■ ఫర్టిలైజర్ షాపు యజమానులతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి గోవింద్

పెద్దశంకరంపేట, జనవరి 20: గ్రామీణ ప్రాంతాల్లో ఎరువులను ఈపాస్ ద్వారా డీలర్లు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ సూచించారు. శనివారం పెద్దశంకరంపేటలోని వ్యవసాయశాఖ కార్యాలయంలో ఎరువుల విక్రయ కేంద్రాల యజమానులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన ఎరువులు అందించాలన్నారు. ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు తప్పనిసరిగా రసీదు తీసుకోవాలన్నారు. వాటికి సంబంధించిన స్టాక్ రిజిష్టర్‌ను రికార్డులను సక్రమంగా నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఏడీఏ రాంప్రసాద్, వ్యవసాయాధికారులు రాజేశ్‌కుమార్, జావేద్, ఎరువుల దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

## 'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌రావు

రామాయంపేట, జనవరి 20 : పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎంఈవో శ్రీనివాస్‌రావు తెలిపారు. శనివారం మండలంలోని ఝాన్సీలింగాపూర్ గ్రామంలో ఉన్న ప్రభుత్వ ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించి, విద్యార్థులు, ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పదో తరగతిలో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. ఆయనతో హెచ్ఎం శ్యాంసుందరాచారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

## రోడ్డు నిబంధనలు పాటించాలి



పెద్దశంకరంపేటలో లారీకి రేడియం స్టిక్కర్ అతికిస్తున్న హైవే ప్రెటోలింగ్ సిబ్బంది

పెద్దశంకరంపేట, జనవరి 20 : రోడ్డు నిబంధనలు ప్రతిఒక్కరూ పాటించాలని జాతీయ రహదారి ప్రాజెక్ట్ ఐఎంఎస్ మేనేజర్ ఖాజా మోయినుద్దీన్ అన్నారు. శనివారం పెద్దశంకరంపేట శివారులోని 161వ జాతీయ రహదారిపై రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా హైవే, ప్రాజెక్ట్ హైవే పెట్రోలింగ్ సిబ్బంది వాహనదారులకు అవగాహన కల్పించారు. వాహనాలను మద్యం సేవించి, రాంగ్ రూట్‌లో నడపవద్దన్నారు. కార్యక్రమంలో పోలీస్ హైవే పెట్రోలింగ్ ఏఎస్సై షరీఫ్, కృష్ణయ్య, సిబ్బంది శివకుమార్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ముదిరాజ్ గ్రామ కమిటీ ఎన్నిక



సభ్యులకు నియామక పత్రాన్ని అందజేస్తున్న మెదక్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ అధికారి శ్రేయ

శివ్వంపేట, జనవరి 20 : మండలంలోని పెద్దగొట్టిముక్ల గ్రామంలో మెదక్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ శ్రేయ ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహేశ్ ముదిరాజ్, ఉపాధ్యక్షుడిగా గణేశ్ ముదిరాజ్, కార్యదర్శిగా నరేశ్ ముదిరాజ్‌ను ఎన్నుకున్నారు. డైరెక్టర్లుగా మహేశ్, ఆంజనేయులు, కృష్ణ, మల్లయ్య, వెంకటేశ్ ఎన్నుకోబడ్డారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు మోకాళ్ల నవీన్, వార్డుసభ్యులు పోచయ్య, శ్రీనివాస్, శేఖర్, నరేశ్, కమిలి నగేశ్, మల్లేశ్, ప్రభాకర్, శ్రీకాంత్, రమేశ్ పాల్గొన్నారు.

## బాధిత కుటుంబానికి జడ్పీటీసీ చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న జడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట, జనవరి 20: మండలంలోని మగ్దూంపూర్ గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన ఎండీ ఇస్మాయిల్ కుటుంబాన్ని జిల్లా ప్రణాళిక సంఘం సభ్యుడు, జడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా శనివారం పరామర్శించి రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. ఆయన వెంట సర్పంచ్ సోము అశోక్, వార్డుసభ్యుడు ఎండీ అర్షత్ తదితరులు ఉన్నారు.

## ఇష్టంగా చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చు



మాట్లాడుతున్న మోటివేటర్ మల్లేశం

మెదక్ మున్సిపాలిటీ/ మెదక్ అర్బన్, జనవరి 20 : జాతీయ భావాలు పెంపొందించుట, వ్యక్తిగత నైపుణ్యాలు, నైతిక విలువలు, పరీక్షలకు సన్నద్ధత వంటి అంశాలపై విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి జిల్లా అధ్యక్షుడు ప్రభాకర్ ఆధ్వర్యంలో శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై కౌన్సిలర్ మల్లేశం అన్నమయ విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన కార్యక్రమాన్ని సత్యసాయి సేవా సంస్థలు ఏర్పాటు చేసినందుకు డీఈవో రాధాకృష్ణ అభినందించారు. విద్యార్థులు 10 జీపీఏ సాధించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మల్లేశం, ఎంఈవో నీలకంఠం, బాధ్యులు రాజేశ్, మల్లేశం, ప్రభాకర్, డాక్టర్ సురేశ్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా నవోదయ ప్రవేశ పరీక్ష

■ జిల్లాలో 933 మంది హాజరు

మెదక్ మున్సిపాలిటీ/ నర్సాపూర్, జనవరి 20: నవోదయ విద్యాలయంలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశాలకు జిల్లాలో ఏడు కేంద్రాల్లో శనివారం పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 1,501 మందికి 933 మంది విద్యార్థులు హాజరయ్యారు. 568 మంది గైర్హాజరైనట్లు డీఈవో రాధాకిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్‌లో 4, నర్సాపూర్‌లో 2, రామాయంపేటలో ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాలను డీఈవో, ఎంఈవోలు నీలకంఠం, యాదగిరి, బుచ్యానాయక్ పర్యవేక్షించారు.

**నర్సాపూర్‌లో 243 విద్యార్థులు హాజరు**

నర్సాపూర్ మండలంలో నవోదయ ప్రవేశ పరీక్షలకు 243 మంది విద్యార్థులు హాజరైనట్లు ఎంఈవో బుచ్యానాయక్ తెలిపారు. 376 మందికి 243 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. విష్ణు పాఠశాలలో 208కి 134 మంది, ప్రభుత్వ బాలుర పాఠశాలలో 168కి 109 మంది హాజరయ్యారన్నారు.